నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్‌లోని శ్రీల 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, శ్రీల అపార్ట్‌మెంట్స్, వాటర్ వర్క్స్ కార్యాలయం, కల్వరి టెంపుల్ ప్రాంతాలు.

- మాతృశ్రీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు, దుర్గామాత 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- కల్యాణ్‌గార్డెన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మియాపూర్ ప్రధాన రోడ్డు, రాజారామ్‌కాలనీ, సాయిరంగ థియేటర్ ప్రాంతం, మాధవ నగర్, అంబేడ్కర్‌నగర్, నందినగర్ కల్యాణ్‌గార్డెన్ ప్రాంతంలో సరఫరా ఉండదన్నారు.

గచ్చిబౌలి పరిధిలో..

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 గంటల నుంచి మ. ఒంటి గంట వరకు ఖాజగూడ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్, సాస్ ఇన్‌ఫ్రా, సాయి ఐశ్వర్య లే అవుట్, సాయి వైభవ్ కాలనీ, ఓక్రిడ్జ్ కాలనీ, చిత్రపురి కాలనీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఎల్ఐజీ, ల్యాంక్ టవర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

మయూరినగర్, కేంద్రీయ విహార్ పరిధిలో..

మియాపూర్: మయూరినగర్, కేంద్రీయ విహార్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మయూరినగర్ ఓల్డేజ్ హోమ్ అపోజిట్ ప్రాంతం, ఎస్‌బీఐ బ్యాంకు లైన్. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రీయ విహార్, మయూరినగర్ పార్ట్ భాగం కోలంబస్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటవరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానకుంట, విజిటేబుల్ మార్కెట్, ఎస్ఎం లేఅవుట్ ప్రాంతాలు.

- చందానగర్ హుడాకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చందానగర్ హుడా కాలనీ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఐటీ కారిడార్‌లో గంజాయి చాక్లెట్ల కలకలం


గంజాయి చాక్లెట్ల బ్యాగు

గచ్చిబౌలి: ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల సమీపంలో గంజాయి చాక్లెట్ల విక్రయాలు కలకలం రేపింది. ఆన్‌లైన్ పార్సిళ్ల ద్వారా పాన్‌షాప్‌ల నిర్వాహకులు గంజాయి చాక్లెట్లను ఆర్డర్ చేసి విక్రయాలకు పాల్పడుతున్నారు. మంగళవారం గచ్చిబౌలి పోలీసులు, టీఎస్ నాబ్ అధికారులు సంయుక్తంగా నానక్‌రాంగూడలోని ఓ పాన్‌షాప్ మీద దాడి చేసి 560 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రం మత్తిగురి ప్రాంతానికి చెందిన హిలాలుద్దిన్ మంజుంబార్(29) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి నానక్‌రాంగూడలో ఉంటూ స్థానికంగా ఉన్న పాన్‌షాప్‌లో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం సొంతంగా నానక్‌రాంగూడ గ్రామంలో సొంతంగా పాన్‌షాప్ ప్రారంభించాడు. ఇదే సమయంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా లక్నోకు చెందిన బిపిన్ పరిచయం చేసుకున్నాడు. అతని ద్వారా ఆన్‌లైన్‌ల గంజాయి చాక్లెట్లను తెప్పించుకొని విక్రయించడం ప్రారంభించాడు. ఒక్కో చాక్లెట్ రూ.5 చొప్పున ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి ఎక్స్‌ప్రెస్ బీ కొరియర్ ద్వారా చాక్లెట్లను తెప్పించుకుంటున్నాడు. ఈ విషయాన్ని సమాచారం అందుకున్న టీఎస్ నాబ్ అధికారులు గచ్చిబౌలి పోలీసులతో కలిసి హిలాలుద్దిన్ పాన్‌షాప్ మీద దాడి చేశారు. ఎక్స్‌ప్రెస్ బీ కొరియర్ పార్సిల్ తీసుకుంటుండగా పట్టుకొని తెరిచి చూడగా అందులో 560 గంజాయి చాక్లెట్లు లభించాయి. మునక్కా నెంబర్–1 పేరుతో ఉన్న ఈ చాక్లెట్లు మొత్తం 2,800 గ్రాములు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

గద్దర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కౌన్సిలర్ భరత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా ఈ నెల 31న తెల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లారి భరత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం నిర్వహించనున్న గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు కొల్లారి సత్తయ్యతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. గద్దర్ విగ్రహావిష్కరణకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గృహ నిర్మాణాలకు భూమిని కేటాయించండి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ కార్మికులు రిజిస్టర్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారని, వారి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం భూమిని కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన కలెక్టర్ క్రాంతిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహరెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని ఐదు నుంచి పది ఎకరాల భూమిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు హౌసింగ్ సొసైటీకి కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కాంగ్రెస్ నాయకులు కుంచాల కిషన్, కార్మిక సంఘం నాయకులు చంద్రమౌళి, శ్రీధర్, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ఎస్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజ మల్లయ్య తన సొంత నిధులతో మంగళవారం బీహెచ్ఈఎల్ జిల్లా పరిషత్, పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దామోదర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమల్లయ్య తనకు వచ్చే పెన్షన్‌లోని కొంత డబ్బును పేద విద్యార్థులకు ఖర్చు చేయడం సంతోషకరమన్నారు. ప్రతిఒక్కరూ రాజమల్లయ్యను ఆదర్శంగా తీసుకొని పేద విద్యార్థులకు సాయం చేయాలని సూచించారు.





నాడు వ్యర్థాలకు నిలయం..
నేడు పచ్చందాలకు నెలవు

- 'ఐఎస్‌బీ'కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- ఆహ్లాదకర వాతావరణం, ఆధునిక వసతులు

రాయదుర్గం: కచ్చారోడ్డు.. పిచ్చిమొక్కలు..మట్టికుప్పలు, వ్యర్థాలు పారబోసే ప్రాంతంగా ఉండే ప్రాంతం నేడు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) అనేది అంతర్జాతీయంగా గుర్తింపుతో పాటు దేశంలోనే నెంబర్‌వన్ బిజినెస్ స్కూల్‌గా అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఈ ఉన్నత విద్యాసంస్థ ఏర్పడి 23 ఏళ్ల పూర్తికావడం విశేషం. గచ్చిబౌలి ప్రాంతంలో ఒకప్పుడు వ్యర్థాలతో కూడిన ఎగుడు దిగుడు చదును చేయలేకుండా ఉన్న ప్రాంతంగా ఉండే చోటును చదును చేసి ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విద్యాలయంగా తీర్చిదిద్దబడింది. 23 ఏళ్ల క్రితం గచ్చిబౌలి ఐటీ కారిడార్‌కు ఆనుకొని ఏర్పాటు చేసిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నేడు ఎంతో ప్రగతిని సాధిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించింది. గచ్చిబౌలి లో ప్రధాన క్యాంపస్‌ను ఉండగా పంజాబ్ రాష్ట్రంలోని మొహలీలో మరో క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. దేశంలో ఉన్నతమైన ఉన్నతవిద్యా కేంద్రంగానే కాకుండా ఆహ్లాదపూరిత వాతావరణం, పచ్చదనం, వివిధ రకాల పక్షులు నెమళ్లకు నిలయంగా మారింది.

'సీఏఎస్ఈఎస్‌టీ'కి టెక్నోవేషన్ అవార్డు


అవార్డును అందుకుంటున్న సెంటర్ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సీఏఎస్ఈఎస్‌టీ)కు జాతీయ స్థాయి అవార్డు లభించడం విశేషం. ఇండియా ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) ద్వారా 2024 టెక్నోవేషన్ అవార్డును అందుకొంది. ఐఈఎస్ఏ ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కోసం భారతదేశం యొక్క ప్రధాన పరిశ్రమ సంస్థగా కొనసాగుతోంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఫిజిక్స్‌లోని సీఏఎస్ఈఎస్‌టీ సెంటర్‌కు ఇటీవల జరిగిన విజన్ సమ్మిట్–2024లో ఈ అవార్డును అందించారు. ఎంటెక్ (ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ, ఎంటెక్ (మైక్రో ఎలక్ట్రానిక్స్, వీఎల్ఎస్ఐ కోర్సులలో 150 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేయడం మరో విశేషం. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ డిజైన్ అండ్ సెమీ కండక్టర్ తయారీ ప్రక్రియలో శిక్షణ, ఫ్యాబ్రికేషన్ సదుపాయంలో అందించబడుతుంది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ 2023లో సీఏఎస్ఈఎస్‌టీకి చిప్‌టుస్టార్టప్ ప్రాజెక్టును అందజేసింది. బోధన, పరిశోధన కార్యక్రమాలను బలోపేతం చేయడానికి, జాతీయ సెమీకండక్టర్ మిషన్‌కు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. హెచ్‌సీయూలోని సీఏఎస్ఈఎస్‌టి సెంటర్ 2024 టెక్నోవేషన్ అవార్డును పొందడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అవార్డులు సాధించాలని హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. దశాబ్దాలుగా సీఏఎస్ఈఎస్‌టీలో అందించబడుతున్న ఉన్నత స్థాయి నాణ్యమైన శిక్షణ, విద్య యొక్క దీర్ఘకాల నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

అత్యాధునిక ల్యాబ్‌ల ఏర్పాటే 'మనూ' లక్ష్యం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్‌లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఏఆర్/వీఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ/ వర్చువల్ రియాలిటీ) మెటావర్స్ ప్రాజెక్టు ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధునాతన పరిశోధన, ఆవిష్కరణల కోసం ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ద్వారా సీఎస్ఐటీకి రూ.95 కోట్ల నిధులను కేటాయించడం ద్వారా ఈ ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. వికలాంగులకు మద్దతివ్వడం, మేధోపరమైన వైకల్యం ఉన్న వారిలో స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం, సాధికారత కల్పించడం, పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం నిబద్ధతతో సరితూగే విశ్వవిద్యాలయం యొక్క ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో ఒకటిగా నిలిచిందన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ కోసం ఒక సహకార వాతావరణాన్ని సృష్టించడంలో విశ్వవిద్యాలయానికి ప్రతీకగా ఈ ల్యాబ్ మారుతుందన్నారు. మన ప్రపంచాన్ని తీర్చిదిద్దే వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలతో నిండిన భవిష్యత్తుకు పోర్టల్‌గా ల్యాబ్‌ను ఉంచడంతోపాటు యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం కొత్త సరిహద్దులను అన్వేషించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐటీ ప్రొపెసర్ అబ్దుల్ వాహిద్, ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో రూ.1,20కోట్ల వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం, రూ.60లక్షలతో వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మనబడి పథకం ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సరిపడా సిబ్బంది, ఆధునిక వసతులు కల్పిస్తున్నా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామకృష్ణనగర్‌లోని సమస్యలను పరిష్కరిస్తాం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఏకాంత్‌గౌడ్, విద్యాకల్పన మంగళవారం వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. రోడ్ నం.17లోని బండరాళ్లను తొలగించి రోడ్డును అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు రిక్షా పుల్లర్స్ కాలనీ నుంచి డ్రైనేజీ రోడ్ నం.19లో 8 ఇంచ్‌ల డ్రైనేజీ పైపు ఓవర్‌ఫ్లో కావడంతో డ్రైనేజీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. పైపుల సామర్థ్యాన్ని పెంచాలని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నవీన్, పల్నాటి అశోక్, నారాయణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 60, కీర 30, బీర 70, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 40, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 280, వెల్లుల్లి 280.

వ్యక్తి అదృశ్యం

గచ్చిబౌలి: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ శంకర్ నాయక్ వివరాల ప్రకారం..నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన మున్నూరు శివయ్య(45) బతుకుదెరువుకోసం వచ్చి వట్టినాగులపల్లి వాటర్ ట్యాంక్ సమీపంలో ఉంటున్నారు. కూలీ పనులు చేస్తున్న శివయ్య జనవరి 25న ఇంటి నుంచి వెళ్లి ఎంతకీ రాలేదు. తెలిసినవారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫొటో30జీసీబీ10బి–160054: శివయ్య

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పటాన్‌చెరు టౌన్: క్రషర్ల నుంచి డస్ట్‌ను తరలించే టిప్పర్ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిబంధన పాటించని వారిపై చర్యలు తప్పవని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని లక్డారం జాతీయ రహదారిపై టిప్పర్ డ్రైవర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డస్ట్‌ను తరలించే వాహనాదారులు తప్పనిసరిగా మ్యాట్‌తో కవర్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని సెవన్‌హిల్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, వంశీకృష్ణ, సుశీల, రవీంద్రనాథ్‌రెడ్డి, దొడ్ల బ్రహ్మానందగౌడ్, సదా శ్రీనివాస్ నియమితులయ్యారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. సత్యంగౌడ్, కావూరి ప్రసాద్, వెంకటేష్, నాగయ్య, డి. వాసు, రాము, కోటేశ్వరరావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఏపీలో కులగణనను వ్యతిరేకించడం అవివేకం

ఉస్మానియాయూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కులగణనను నిలిపివేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఈసీకి లేఖ రాయడం అవివేకమని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఆయన్ను విశాఖలోని మానసిక వైద్యశాలలో చేర్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే కావాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని కులగణనతోనే బీసీల హక్కులు సాధించుకోగలమన్నారు.

సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నూతన సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశామని ఈఓ కె.అంజయ్య తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 18వ తేదీలోపు దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు, అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కరాటేలో గచ్చిబౌలి క్రీడాకారుల సత్తా



గచ్చిబౌలి: కరాటే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో రాణించారు. 41వ జేకేఏ కరాటే జాతీయ పోటీలు, 16వ కేవైయూ లెవల్ పోటీలలో తమ సత్తాను చాటారు. జేకేఏ ఇండియా ద్వారా గోవాలోని కంపాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో గచ్చిబౌలికి చెందిన కరాటే క్రీడాకారులు తమ సత్తా చాటి తమలోని క్రీడానైపుణ్యాలను చాటి 12 బంగారు, 16 వెండి, 10 కాంస్య పథకాలను సాధించారు. అండర్–12 నుంచి అండర్–18 వరకు వివిధ విభాగాల పోటీలలో పాల్గొని తమ సత్తాను చాటుకోవడం మరో విశేషం. ముఖ్యంగా కాలా అండ్ కుమిటీ కేటగిరిలలో విద్యార్థుల ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. పథకాలను సాధించిన విద్యార్థులను అధికారులు అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పథకాలు సాధించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.

వ్యాస రచన పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 'కుక్కలు కరవడం వల్ల వచ్చే వ్యాధులు, నివారణ'అనే అంశంపై వ్యాస రచన పోటీలు మంగళవారం నిర్వహించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్స్ రామారావు, మానసరెడ్డి మాట్లాడుతూ.. జంతు జాలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, ధనలక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

అక్రమంగా వైన్ తయారు చేస్తున్న వ్యక్తి రిమాండ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వైన్

హఫీజ్‌పేట్: అక్రమంగా వైన్‌ను తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం అమీన్‌గ్రామానికి చెందిన సైదు దేవి సుమన్ కృష్ణ (34) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్రమంగా ఇంట్లో వైన్‌ను తయారు చేసి గుట్టుచప్పుడు కాకుండా లీటర్ వైన్‌ను రూ.850 విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు సుమన్‌ను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల వైన్‌తో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులలో డీటీఎఫ్ శంషాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీకాంత్, శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ: కలెక్టర్ క్రాంతి


మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: అర్హులందరూ ఓటరు జాబితాలో ఉండాలని, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడానికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఫారం6, 7, 8ల ప్రాసెస్ ప్రక్రియ, డిస్పోజల్స్ తీరు, ఫైళ్లను పరిశీలించారు. అనంతరం రాజకీయ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. బీఎల్‌ఓల విషయంలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పూర్తి ఆధారాలతో మృతిచెందిన వారి, డూప్లికేట్ ఓటర్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఫారం6 ఓటర్ నమోదుకు సంబంధించి అడ్రస్ ప్రూఫ్, బీఎల్ఓ రిపోర్ట్ ఆధారంగా అప్రూవ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ దేవుజా, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారులు పాల్గొన్నారు.

షీ-టీమ్ బోర్డులను ఏర్పాటు చేయండి

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు, బస్టాపుల వద్ద షీ–టీమ్ నెంబర్ బోర్డులను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ఈ మేరకు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి బుద్ధుడి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలు, బస్టాపుల వద్ద విద్యార్థినులు, మహిళలు ఏదైనా అసౌకర్యానికి గురైతే తక్షణమే స్థానిక పోలీసు సిబ్బంది,షీ–టీం నెంబర్లను సంప్రదించే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా కాలనీలలో, పారిశ్రామికవాడలో గస్తీని పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంచాల కిషన్, యువరాజ్ మోరే, అబ్దుల్ హమీద్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఏసుదాసు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్‌కు వచ్చి మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అమీన్‌పూర్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీలో శ్రీనివాసరావు అనే వ్యక్తి నిర్మిస్తున్న పెంట్ హౌస్ వద్ద ఈ నెల 30వ తేదీన పని చేసేందుకు మేస్త్రీలతో కలిసి వెళ్లాడు. అయితే వీరితో పాటు ఏసుదాసు అన్న కొడుకు నిహామీయ(14) వచ్చి పనిచేసే చోట మట్టిపై కూర్చున్నాడు. ఈ క్రమంలో పెంట్ హౌస్ పనులను పరిశీలించేందుకు వచ్చిన యజమాని శ్రీనివాసరావు పనిచేసే చోట రెండో అంతస్తు నుంచి ఇనుప రాడ్డును నిహామీయతో కలిసి కిందకు వేసే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు రాడ్డుకు తగిలి షాక్ తగలడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఇద్దరిని చికిత్స నిమిత్తం చందానగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. నిహామీయ చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.